# ప్రాణబిలం

శాఖమూరి శ్రీనివాస్

రోహిణీకార్తె! ఈ కాలంలో రోళ్ళు సైతం పగిలి పేలాల్లా ఎగిరి పడతాయనేది సామెత. కుంటలు, చెరువుల్లో చుక్కనీరు లేదు. కాసేపు ఎండలో ఉంటే చాలు జీవంకూడా ఆవిరయ్యేంత శాకం తగులుతోంది.

ఆ రోజు ప్రొద్దున్నే హడావుడిగా వెళుతున్న యోగయ్యను రాములవారి గుడికాడ ఆపాడు వెంకటస్వామి.

''ఏందోయ్ ఆ తొందర. సేనికేనా! బోరేప్తిన్నవంటగా?...'' మిగతా వివరాలు చెప్పమన్నట్లు ముఖాన్ని ప్రశ్నార్థకంగా పెట్టాడు.



''అవును మామా సేలో బోర్లన్నీ ఎండిన్లై. ఎంతసేపు మోటరేసినా సెంబెడు నీళ్ళు కూడా రావడంల్య అందుకే కొత్త బొక్క తప్పేలా ఇప్పుడుగాన జల తగిలిందంటే అదురుట్టమే. వానాకాలానికి బోరునిండ నీళ్ళుంట్లై. ఒంటిరిగాన్నయిపోతిని, అన్నీ నేనే సేసుకోవద్దు. నీకంటే నలుగురు కొడుకులు కూసోబెట్టి సాకుతున్నరు.

''కూసోబెట్టి ఏం కర్మరసామి పండబెట్టి నోట్లో ముద్దబెడుతున్నరు''. నవ్వుతూనే ''ఇంతకీ పాయింట్ ఎవుర్తో పెట్టించావు? అదిశానా ముక్కెం కదా''

''మల్లయ్యతోటి''

''వాడు బెట్టినోటిల్లో శానావాటిల్లో నీళ్ళు బడ్డయిలేగాని వాడ్నంతా మాయదారి మల్లిగాడంటరు. కాస్త సూసి పెట్టమను ఇప్పటికే నువ్వు బోర్లల్లో శానా దెబ్బతిని ఉన్నవు''.

వెంకటస్వామి మాటలకు యోగయ్యకు తన ఐదెకరాల పొలంలోని ఒట్టిపోయిన తొమ్మిది బోరుబావులు గుర్తొచ్చాయి. వేయించబోయేది పదోది! కాలువలో, చెరువులో ఉండి పుష్కలంగా

నీరున్న ప్రాంతం కాదది. బోర్ల నీటినే నమ్ముకుని తమ జీవితాలను గాలిలో దీపంలా భావించే రైతాంగం పండినానాడు తినడం, లేనినాడు ఎండు కోవడం తప్ప ఇతర మార్గాల గురించి ఆలోచించని అమాయక ప్రజల గడ్డ అది.

యోగయ్య పొలం నాలుగేళ్ళ క్రిందటి వరకూ రతనాలు పండించిందే. ఇంటినిండా తిండిగింజ లతో పండుగ సంబరాలలో మునిగి తేలేలా చేసిందే

ఈ నాలుగేళ్లనించే అరటి, బొప్పాయిల దెబ్బకు భూమాత చనుబాలు ఎండిపోయాయి. సార మంతాపోయి సమస్యల కాసారం మిగిలింది. లక్షల విలువ చేసే పంటలు పండినా యోగయ్యకు మిగి లింది అంతంతమాత్రమే.

ముక్కు మొహం తెలీని మనుషులు కూడా వచ్చి ఆప్యాయంగా పలుకరిస్తుంటే యోగయ్య మురిసిపో యేవాడు. ఢిల్లీ ఎక్కడ? ముంబాయి ఎక్కడ? ఏమైనా తనేసిన పంటలవల్లే కదా వాళ్ళు తనను గుండెలకు హత్తుకుంటోందని పొంగిపోయేవాడు. తన పంటని గ్రద్దలా తన్నుకు పోయేంతవరకే దళారి ప్రేమ కురుస్తుందని గ్రహించేలోపు ఆరణాల సరుకు అర్ధగానే రాష్ట్రాల సరిహద్దులు దాటేది. చేతిలో పడ్డ కాసిన్ని డబ్బులు విత్తనాలు, మందు కొట్టడానికే సరి. ఇక మిగిలేదేముంది? కూడబెట్టేదే ముంది? తన కార్పోరేట్ వ్యవసాయానికి గుర్తుగా ఒట్టిపోయిన బోర్లు మిగిలాయి.

ఈ నాలుగేళ్ళనించీ ఇదే తంతు. రెండుకళ్ళూ చెమర్చాయి. తడి కనపడకుండా నలక పడ్డట్టు కళ్ళు నులుముకుంటూ, ''వాడికి గట్టిగానే సెప్పిన మామా నిన్నోపాయింటు పెట్టిండు. మళ్ళీ ఈ రోజు కూడా సరిగ్గా సూడమన్న. నిన్న సూపిన కాడనే వాడి సేతుల్లోని పుల్లజారిందా, మనకు అదుట్టం ఉన్నట్టే. కచ్చితంగా ఆడనీళ్ళుంటై'' కండువాతో చెమట తుడుచుకుంటూ చెప్పాడు యోగయ్య.

బోర్ పాయింట్లు పెట్టడంలో మల్లయ్యలాంటో ళ్ళదే హవా! జియాలజిస్టుల మాట ఎవరూ వినరు. రెండు అరచేతులతో ఓ పూజ చేసిన టెంకాయ పెట్టు కుని దానిపై ఓ పంగలపుల్ల ఉంచి పొలమంతా తిరు గుతూ ఎక్కడ ఆ పుల్ల జారిపడితే అక్కడ నీళ్ళుంటా యని, అక్కడ బోరేయమని చెబుతారు. జియాలజి స్టుల్తో కుదిరేదికాదని, ఖరీదెక్కువనేది రైతుల వాదన. పుల్లతో పాయింట్ పెట్టేవాళ్ళకయితే నూట పదహార్లు సరిపోతాయని, అందుబాటులో ఉంటా రని భరోసా.

భూగర్భంలో నీరు పుష్కలంగా ఉన్నప్పుడు పుల్ల సైంటిస్ట్‌ల జేబులు కళకళలాడేవి. కళ్లు మూసు కుని ఎక్కడ తవ్వించినా నీరుపడేది. కరువొచ్చి, బోర్లు ఒట్టిపోయిన ఇలాంటి సమయాల్లో తాము పెట్టే పాయింట్లు నూటికి తొంభై తొమ్మిది విఫలం అవతాయని తెలుసు. అందుకే రైతు దగ్గర హామీ తీసుకుని నీళ్ళు పడకుంటే తమ తప్పేం లేనట్లని, పుల్లదే మొత్తం బాధ్యతన్న భరోసా ఇప్పించుకుని మరీ రంగంలోకి దిగుతున్నారు.

మల్లయ్య కూడా యోగయ్య వద్ద అలాంటి హామీనే పొంది నిన్న ఓ పాయింట్ చూపాడు.

వెంకటస్వామి దగ్గర నుంచి చేనుకు వచ్చాడు యోగయ్య. అప్పటికే అక్కడ బోరుబండి సిద్ధంగా ఉంది. బండి లీజుదారు సోమయ్య యోగయ్యకు తెలిసినవాడే. యోగయ్య చేలోని బోర్లన్నీ ఈ బండే వేసింది.

''ఏందన్నా ఆలస్యమయిందే'' నవ్వుతూ అడి గాడు సోమయ్య.

''ఎంకటస్వామి మామ మాట్లాడుతుంటే ఆగిన సరేగాని, మల్లయ్య రాల?'' చుట్టూ చూస్తూ అడి గాడు.

''వాడు ఏడూళ్ళ పూజారి అయినా, నిన్న పాయింట్ పెట్టి, గుర్తుకు సున్నం పోశానని సెప్పిండే''.

''మళ్ళీ ఇప్పుడొచ్చి పెట్టమన్నాను. ఓ అరగంట ఆగుదాం వాడొచ్చి పాయింట్ సూపుతే మొదలుబె డుదువు''.

''నాదేముంది. నువ్వెప్పుడంటే అప్పుడు మల్ల య్యను రానీలే అయితే'' అంటూ చేనిగట్టు పైన కూర్చున్నాడు సోమయ్య. యోగయ్య కూడా అతని పక్కనే కూలబడ్డాడు. బోర్‌బండిలో పని చేసే వర్క ర్లంతా తమిళనాడోళ్ళే. బండి కూడా తమిళనాడుదే. సోమయ్య లీజుకు తీసుకుని నడిపిస్తున్నాడు.

పంపుకొట్టే కిరసనాయిలు స్టౌమీద కొంతమంది వర్కర్లు అన్నం, చారు వండుతున్నారు. మరి కొందరు లివర్లకు గ్రీజు పట్టిస్తూ, పైపులు లెక్కబె డుతూ ఉన్నారు.

''కేసింగ్ పైపు యాడ తీసుకున్నవు?'' యోగ య్యను అడిగాడు సోమయ్య.

''ఎర్రబాలెంలో గడియారం స్తంభం కాడ ఉన్నే అదే పైపుల సాంబడు వాడి దగ్గర డబ్బులియ్య కున్నా కాసిన్ని రోజుల బరాయిస్తడు కదా''.

''వాడుత్త లిగాడోడు అయితే వాడికాడికి పోయి నావా! ఇప్పటికేమో తీసకపో అంటడు. రెండ్రోజు లకే కుతిక మీద గూసుంటడు. పూర్ణయ్య అయితే మన మిచ్చినప్పుడు తీసుకునేటోడు కదా''.

''అయిపోయింది కదా సోమయ్యా పైపులు కూడా ఈ సరికి ఆటోల ఏసి పంపింటడేమో''.

''కనుక్కుంటాగు'' అని తన సెల్‌ఫోన్ తీసి సాంబడితో మాట్లాడించి క్యాన్సిల్ చేయించాడు సోమయ్య. పూర్ణయ్యకు ఫోన్ చేసి వెంటనే కేసింగ్ పైపు పంపమని చెప్పాడు.

ఈ లోపు మల్లయ్య వచ్చాడు. పంగల పుల్లతో ఓ పదినిమిషాలు చేలో తిరగాడు. పుల్ల మళ్ళీ ''నిన్న పాయింట్ చూపినచోటే'' జారింది.

యోగయ్య మనసు శాంతపడింది. ఖచ్చితంగా నీళ్ళుపడతాయనే భావించాడు. రెండుసార్లూ ఒకే పాయింట్ చూపడంతో అతని నమ్మకం బలపడింది

పూజ చేసి ''టెంకాయకొట్టి అగరొత్తులు వెలి గించాక బోర్‌త్రవ్వడం ప్రారంభమైంది. ''డబ్ డబ్'' అంటూ కాసేపు, శబ్దం రాకుండా కాసేపు ఎర్ర, సుద్ద మట్టి మేఘాలు లేపుతూ డ్రిల్లింగ్‌బిట్ భూమి లోకి చొచ్చుకుపోతోంది.


దాంట్లో నీళ్ళు పడేదాకా మనసు కుదుటపడదు. అందుకే దూరంగా వెళ్ళి బోర్‌బండి వైపే చూస్తూ కూర్చున్నాడు యోగయ్య. మళ్ళీ వస్తానని చెప్పి సోమయ్య తన బైక్‌పై ఎర్రబాలెం పోయాడు.

మధ్యాహ్నం అయింది. ఎండ తన వేడిసూదు లతో దాడి చేస్తోంది. వర్కర్లలో కొంతమంది భోజ నం చేస్తూ, మిగిలిన వారు డ్రిల్లింగ్ పని చూస్తు న్నారు. భోంచేస్తున్న వారి దగ్గరికొచ్చి ''యాంది తమ్ముడూ ఎన్నడుగులు పోయింది'' అడిగాడు యోగయ్య.

''ఎంతన్నా వందే'' చేయాల్సింది చాలా ఉంద న్నట్లుగా ముఖం పెట్టారు వాళ్ళు. వారి హావభా వాలు సహజమే! మూడొందల అడుగులకు తక్కువ లోతు తవ్వించేవాడు ఈ ప్రాంతంలోనే లేడు. ఒక వేళ తక్కువలో నీళ్ళుపడ్డా, ఒకరాత్రి చేనును తడిపే సరికి ఆవిరైపోతాయి.

యోగయ్యకూడా ''వందేనా తొందరగా కాని య్యాల సామి మాపిటిజాముకల్లా అయిపోవాల'' తొందరజేశాడు.

కాసేపటికి యోగయ్య భార్యవెంగమ్మ చంకలో సంవత్సరం కొడుకు వెంకటేష్‌తో కలిసి భోజనం క్యారేజి తీసుకొచ్చింది.



"ఈడ్నెందుకు తెచ్చినవ్ ఎండసూడు ఎట్టుందో పెద్దోళ్లకు మనకే అలివికావడంలా ఈ టిపినీ నేను తెత్తానులేగాని, నువ్వు ఎంబడేపో" అంటూ బోర్ వేసేది కాసేపు చూస్తానన్నా వినిపించుకోకుండా భార్యను ఇంటికి పంపాడు యోగయ్య.

ఈ ఎండకు ఒక్కనాగొక్క కొడుక్కు ఏమైనా అయితే ఎలా? వాడు ఏడుస్తేనే కందిపోతాడని యోగయ్యకు తెగబాధ. వాడికి ఈ వ్యవసాయం అంటకుండా బాగా చదివించి,మంచి ఉద్యోగం చేస్తే చూడాలని ఆశ.

వెంగమ్మ వెళుతూ, "మాపిటేల వత్తానులే అప్పటికి ఎండ బోతది" అనుకుంటూ జారిపోతున్న వెంకటేష్‌ను చంకలోకి లాక్కుంటూ ఇంటి కెళ్ళింది.

భోజనం చేస్తున్నంతసేపూ నోరు మాత్రమే తన పని తాను చేస్తోంది. మిగతా శరీరభాగాలన్నీ బోర్ శబ్దానికి ట్యూన్ అయి ఉన్నాయి. యోగయ్య కళ్లైతే బోర్‌బండికి అతుక్కుపోయాయి.

సాయంకాలమైంది. బోర్‌ను మూడొందల అడుగులపైనే తవ్వారు. కాస్త చెమ్మ తప్ప ఎగిసి పడే జలధారల ఆనవాళ్ళు లేవు. యోగయ్యకు నీరసం ఆవరించింది. ఈ లోపు సోమయ్య ఎర్రటి కిళ్ళీ నములుతూ, నవ్వుతూ దగ్గరికొచ్చాడు. పైపుల పూర్ణయ్య మందు పార్టీ ఎఫెక్ట్ సోమయ్య మొహంలో కనబడుతోంది.

"ఏందన్నా అట్టున్నవు అంటూనే రేయ్ ఎన్నడుగు లేశారు" వర్కర్స్ నడిగాడు.

"మూడూపది"

"మూడూయాభై ఎయ్యండి ఈ గడ్డలో నీళ్లాడబడలై? నా మాట విని ఇంకో నలభై అడుగులు ఎయ్యనీ నీళ్ల పడకుంటే నాదీ పూచీ" ముద్దముద్దమాటల్లోనే, "ఇంకో నలభై ఎయ్యండిరా" అని ఆర్డరేశాడు.

యోగయ్యది నిస్సహాయస్థితి ఇంకాస్త లోతుకెళితే నీళ్ళు పడతాయేమోనన్న ఆశ డబ్బు గురించిన ఆలోచనను పక్కకు తోసేస్తోంది. అన్యమనస్కంగానే, "పోయ్యే డబ్బులు ఎలాగూ పోతాయి ఆ కాసింత తవ్వాక చూద్దాం" అనుకుంటూ దిగాలుగా ఉండిపోయాడు.

ఇంకో ముప్పై అడుగులు లోతుకు వెళ్లగానే నీళ్ల ఫౌంటెన్లా ఎగచిమ్మాయి. లివర్లు ఆపరేట్ చేస్తోన్న వర్కరయితే బురదలో మునిగిపోయాడు. డ్రిల్‌బిట్ చుట్టూ నీళ్ళు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. యోగయ్య ముఖంలో జీవకళ వచ్చింది. గుండెల మీద భారమంతా ఆ నీటి ధారల్లో కరిగినట్లయ్యింది.

"నే సెప్పలా" అన్నట్లు సోమయ్య చిద్విలాసంగా చూశాడు.


"నీ మాట నిజమే అనుబవంతో సెప్పినవు" అంటూ సోమయ్యను ఆకాశం ఎత్తున పొగిడాడు యోగయ్య.

దూరంగా, కొడుకును చంకనేసుకుని వస్తోన్న వెంగమ్మ కనబడగానే, యోగయ్య మరింత ఆనంద పడ్డాడు. అంతా తన కొడుకు అదృష్టమని మురిసిపోయాడు. ఎదురుగా పరుగెత్తుకుంటూ వెళ్ళి కొడుకును లాక్కొని ముద్దులు పెట్టసాగాడు. అతని ఆనందం చూడగానే వెంగమ్మకు విషయం అర్థమయింది. సంతోషం మాటల్ని తడబడేట్లు చేస్తుండగా, "బోర్ కాడికి పోయి సూసొద్దాం పా" అంటూ భర్తతో పాటు బోర్ దగ్గరికి వెళ్ళింది. పని వాళ్ళు డ్రిల్లింగ్ ఆపి పైపుల్ని వెనక్కిలాగేస్తున్నారు. చేను మొత్తం బాగా తడిసింది.

"ఎండాకాలం ఈ మాత్రం నీరుందంటే ఇంకేం నా కిబ్బంది లేదని సంబరపడ్డాడు" యోగయ్య.

సోమయ్యతో లెక్క మాట్లాడడానికన్నట్లు కొడుకును దించి "ఓయ్ ఈణ్ణిపట్టుకో" అని కాస్త దూరంలో ఉన్న భార్యను కేకేశాడు.

వెంగమ్మ కొడుకు దగ్గరికి వచ్చేలోపే వెంకటేష్




నాలుగడుగులు వేసి అప్పటిదాకా ఆకులు, పుల్లలతో కప్పి ఉన్న పనిచేయని పాతబోరులోకి జారిపోయాడు.

ఆ దృశ్యం చూడగానే వెంగమ్మ "పిల్లోడు పడ్డడయ్యా" అంటూ పాడుబడిన బోరును భర్తకు చూపుతూ గావుకేక వేసి విరుచుకుపడింది. వెనుతిరిగి చూసిన యోగయ్యకు క్షణంలోనే విషయం అర్థమయింది. ఒక్క ఉదుటున కూలబడి బోర్‌లోకి తొంగి చూశాడు. అంతా చీకటి. చెయ్యి లోపలికి పెట్టి తడిమాడు. ఉపయోగం లేకపోయింది. కన్నీళ్ళు ధారాపాతమయ్యాయి. బోర్‌వర్కర్లు, సోమయ్య పరిగెత్తుతూ వచ్చారు. వారి నోటెంట కూడా మాట రాలేదు. క్యాబిన్‌లోని టార్చిలైట్ తెచ్చి బోర్‌లోకి వేసిచూశారు. ఇరవై, ముప్పై అడుగుల లోతున తలవెంట్రుకలు కనబడుతున్నాయి.

సోమయ్యకు ఎక్కిందంతా దిగింది. "అన్నా భయపడబాకు పిల్లోడికేం కాదు" అంటూనే సెల్ తీసి పోలీస్‌స్టేషన్‌కు, ఫోన్ చేసి అంతా వివరంగా చెప్పాడు.

కాసేపటికే పోలీసులు, ఎం. ఆర్.వో, అగ్నిమాపక సిబ్బంది, విలేఖరులు, అందరూ వచ్చారు.

ఓ తాడును జారవిడిచి ఎంత లోతులో ఉన్నాడో చూశారు. ముప్పై అడుగుల వద్ద ఉన్నాడు. వెంటనే ఆక్సిజన్ పైప్‌ను లోపలికి వదిలి లైట్ వేస్తూ కదలికలను గమనించసాగారు.

ఎవరినీ బోర్ దగ్గరకు రానివ్వలేదు. ఏడ్చి ఏడ్చి భార్యాభర్తల కన్నీళ్ళు కూడా పూర్తిగా ఖర్చైపోయాయి. గ్రామమంతా కదలి వచ్చింది.

అగ్నిమాపక సిబ్బంది ఓ ఉపాయం చెప్పారు. దానికి ఓ.కె. అన్న ఎం. ఆర్. వో ఓ ప్రొక్లెయిన్‌ను తెప్పించాడు. "ఆ బోరుకు ప్రక్కనే సమాంతరంగా బోర్ క్రిందుగా ముప్పై అడుగుల గుంత తీసి బోర్లోంచి జారే పిల్లోడిని పట్టుకోవాలి" ప్లాన్ బాగానే ఉంది. పనిమొదలయ్యింది.

నాలుగు గంటలకల్లా ఇరవై అడుగులు తవ్వారు. "సార్ ఇంకా లోపలికి వెళుతున్నాడు" అంటూ లైట్‌తో అబ్జర్వ్ చేస్తోన్న ఫైర్‌మన్ అరవగానే తాడుతో ఎంత లోతులో ఉన్నాడో చూశారు. ఓ అయిదడుగులు జారాడు. అంటే ఇంకో పదిహేను అడుగుల గుంతను తవ్వాలి.

తెల్లవారింది. సమాంతరంగా ముప్పై ఐదడుగుల గుంతను తీశారు. ప్రొక్లెయిన్‌ను ఆపి చేత్తో మట్టిని తీసి పోయసాగారు. కాసేపటికి వెంకటేష చొక్కా కనబడింది. జాగ్రత్తగా మట్టిని తీసి బయటకు పోశారు.

పిల్లవాడు బ్రతుకుతాడని ఎవరికీ ఆశలేదు. కొద్దోగొప్పో "దింపుడుకళ్ళం" ఆశ ఉన్నా అదికాస్తా ప్రాణం లేని శరీరాన్ని చూడగానే మాయమైంది. ఒక్కపెట్టున ఊరిజనమంతా ఘొల్లుమన్నారు. కన్నీటితో తడవని కళ్ళులేవు. ఫైర్ సిబ్బంది శవాన్ని జాగ్రత్తగా తెచ్చి యోగయ్య చేతిలో పెట్టారు.

యోగయ్య గుండె వేయి ముక్కలైనట్లైంది. తను ఎవరి భవిష్యత్ కోసమైతే కలలుకన్నాడో వాడు లేడు. వెంకటేష్ శరీరం యోగయ్య కన్నీళ్ళతో తడిసిపోయింది.

"అయ్యో నా కొడుకు సావలేదయ్యా దేవుడికాడికి పోయిండు. దేవుడికింత కచ్చె దేనికయ్యా ఈడ్నే పిలవాల్నా నేను సచ్చినా బాగుండు" వెంగమ్మ హిస్టీరిక్‌గా ఎగిరెగిరి పడుతోంది.

"ఈ బోరు గుంతలతోటే వచ్చిందిరా నాయనా సేటు కాలమంతా బంగారంలాంటి పిల్లాడుబాయె గదరా దేవుడాడున్నడురా? పాపాలు సేసిన పున్యాతుములు సల్లంగనే ఉండరు. అన్నెం పున్నెం ఎరుగ నోడు పాయెగదరా" కళ్లవెంట నీళ్ళు కారుతొన్నా పట్టించుకోక వెంకటస్వామి గొణుగుతూనే ఉన్నాడు.

గుండెలు నిండిన దుఃఖాన్ని ఓపుకుంటూనే భార్యభర్తలిద్దరినీ గ్రామస్తులు ఊర్లోకి తీసుకెళ్ళారు. బోర్లు నిండినా, ఎండినా యోగయ్యలాంటి రైతు కండ్లలో నిండేది విషాదమే.

★